క్లుప్తంగా

తిరుపతి వెళ్లి పింఛన్ అందజేత

తెనాలిఅర్బన్: వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం ఆదివారం పట్టణంలోని 40 వార్డులలో కొనసాగింది. గుంటూరు జిల్లా తెనాలి ఐతానగర్‌కు చెందిన తెనాలి సునీత అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతిలోని ఓ వైద్యశాలలో చికిత్స తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న వార్డు వలంటీర్ తెనాలి అఖిల్ తిరుపతి వెళ్లి ఆమెకు వితంతు పింఛన్‌ను అందజేశారు. 23వ వార్డుకు చెందిన నోముల కోటేశ్వరరావుకు వృద్ధాప్య పింఛన్‌ను వలంటీర్ పి.తేజస్విని, ఇందిరానగర్ కాలనీకి చెందిన తెల్లమేకల భారతమ్మకు వృద్ధాప్య పింఛన్‌ను వలంటీర్ వేమూరి జాహ్నవి పంపిణీ చేశారు.

పేదలకు కంటి వైద్య పరీక్షలు



తెనాలిరూరల్: పట్టణ నాజరుపేటకు చెందిన శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. పెదకాకాని శంకర్ నేత్రాలయ సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. 200 మందికి కంటి శుక్లాలకు సంబంధించిన పరీక్షలు చేశారు. వీరిలో 40 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించారు. వీరిని వైద్యశాలకు తీసుకువెళ్లి ఉచితంగా శస్త్ర చికిత్సలు జరుపనున్నారు. సత్యసాయి సేవా సంస్థల కన్వీనర్ టి.తిలక్, మహిళా కన్వీనర్ టి.మోహనప్రియ, జాయింట్ కన్వీనర్ ఐ. ప్రసాదరావు పర్యవేక్షించారు.

నేటి నుంచి సువార్త స్వస్థత ఉజ్జీవ సభలు

తెనాలిఅర్బన్: పీషోను మినిస్ట్రీస్ వారి ఆధ్వర్యంలో తెనాలిలో సోమవారం నుంచి బుధవారం వరకు సువార్త స్వస్థత ఉజ్జీవ సభలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పాస్టర్ కె మోషే, పాస్టర్ కె పృధ్వీన్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చెంచుపేటలోని వ్యవసాయ మార్కెట్ యార్డు గ్రౌండ్‌లో ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటలకు సభలు జరుగుతాయని చెప్పారు. విజయవాడకు చెందిన ప్రముఖ సువార్తికులు పాస్టర్ చార్లెస్ జాకబ్, పాస్టర్ ఫిలిప్ జాకబ్‌లు వాక్య పరిచర్య చేస్తారన్నారు. క్రైస్తవులు అంతా పాల్గొనాలని కోరారు.

రూపు దిద్దుకుంటున్న పీవీ కాంస్య విగ్రహాలు



తెనాలిఅర్బన్: భారతరత్న, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు భారీ కాంస్య విగ్రహాలు తెనాలిలోని సూర్య శిల్పశాలలో తయారవుతున్నాయి. ఒక్కో విగ్రహ నిర్మాణానికి 500 కిలోల కంచును వినియోగించడం జరిగిందని శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, కాటూరి రవిచంద్ర, శ్రీ హర్షలు ఆదివారం తెలిపారు. ఒక్కో విగ్రహం తయారీకి రెండు నెలల సమయం పడుతుందన్నారు. వీటిని త్వరలో విజయవాడ, గుంటూరు, నెల్లూరు పట్టణాల్లో పీవీ నరసింహారావు అభిమానులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వారి కోరిక మేరకు వీటిని తయారు చేసినట్లు తెలిపారు.

ఇంటి నుంచి తప్పిపోయిన చిన్నారి



దీపిక

పట్నంబజార్: ఐదు సంవత్సరాల చిన్నారి ఇంటి నుంచి తప్పిపోయి పోలీసులకు దొరికిన సంఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం నాజ్ సెంటర్ థియేటర్ వద్ద ఐదు సంవత్సరాల చిన్నారి ఏడుస్తూ తిరుగుతుండగా, పోలీసులు స్టేషన్‌కు తీసుకువచ్చి ఆరా తీశారు. అయితే తన పేరు దీపిక అని, తల్లి పేరు త్రివేణి అని మాత్రమే చెప్పగలుగుతోంది. చిన్నారికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియలేదు. ఈ క్రమంలో ఆమెను శిశుసంక్షేమశాఖాధికారులకు అప్పచెప్పారు. చిన్నారి వివరాలు తెలిసిన వారు కొత్తపేట పీఎస్ ఎస్‌హెచ్‌వో షేక్ అన్వర్ బాషా (86888 31320)కు సమాచారం అందించాలి.

ప్రమాదంలో వ్యక్తి మృతిపై కేసు నమోదు

పట్నంబజార్: ప్రమాదంలో వ్యక్తి మృతిపై కేసు నమోదైంది. వెస్ట్ ట్రాఫిక్ మిర్చి యార్డులో కూలీగా పనిచేసే మస్తాన్‌వలీ(52) ఆదివారం లాలుపురం రోడ్డులోని కృష్ణబాబు కాలనీ మీదుగా వెళ్తున్న సమయంలో లారీ వచ్చి ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మస్తాన్‌వలీ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు చుక్కలతో పోలియో మహమ్మారిని తరిమేద్దాం

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- పట్టణంలోని పలు కేంద్రాల్లో చిన్నారులకు చుక్కల మందు పంపిణీ
- తెనాలిలో పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతం



ఐతానగర్‌లో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: పోలియో మహమ్మారిని తరిమేసేందుకు ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఐతానగర్‌లోని ఎస్ఎస్ఎస్ఎంహెచ్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలియో చుక్కల కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. చిన్నారులకు చుక్కల మందు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు వేసే రెండు చుక్కలు వారి జీవితాల్లో వెలుగులు నింపుతాయని చెప్పారు. ఈ రెండు చుక్కలు పోలియో రాకుండా నియంత్రిస్తాయని అన్నారు. ప్రభుత్వాలు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి పోలియో నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొమ్మురాయల్, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాత ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన పోలియో చుక్కల కేంద్రాన్ని మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ పరిశీలించారు. చిన్నారులకు చుక్కల మందు వేశారు. ఆయన మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డల నుంచి ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు చుక్కల మందును తప్పక వేయించాలని తెలిపారు. పట్టణంలోని అందుబాటులో ఉన్న కేంద్రాలకు చిన్నారులను తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ వైఎస్సార్ అర్బన్‌హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బీబీ జాన్, సిబ్బంది పాల్గొన్నారు.

బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల పరిశీలించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఆమె మాట్లాడుతూ తెనాలి పట్టణంలో 60 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెనాలి పట్టణంలోని 12,723 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఆదివారం సాయంత్రం వరకు 12, 214 మందికి (96 శాతం) వేసినట్లు తెలిపారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలను వేయించుకోని చిన్నారులను గుర్తించి సోమ, మంగళవారాల్లో వేయాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, రోటరీ క్లబ్ అధ్యక్షులు పావులూరి రాంబాబు, అసిస్టెంట్ గవర్నర్ కన్నెంటి మురళీకృష్ణ, సభ్యులు ఈదర వెంకట పూర్ణచంద్, డాక్టర్ రవీంద్రనాథ్, గుప్తా వెంకటరత్నం, ఈదర శ్రీనివాస్, వెంపటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు

కొల్లిపర: చిన్నారుల నిండు జీవితానికి రెండు పల్స్ పోలియో చుక్కలు ఎంతగానో ఉపయోగపడతాయని తల్లిదండ్రులు వారి పిల్లలకు తప్పనిసరిగా చుక్కల మందు వేయించాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని మున్నంగి పీహెచ్‌సీ వైద్యురాలు లక్ష్మీసుధ, ప్రియాంక ఆధ్వర్యంలో నిర్వహించారు. కొల్లిపరలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఎంపీపీ పద్మావతి, ఎస్ఐ రవీంద్రరెడ్డి ప్రారంభించారు. ఎస్ఐ రవీంద్రరెడ్డి మాట్లాడుతూ అప్పుడే పుట్టిన పసికందు నుంచి 5 ఏళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలను దగ్గరలో ఉన్న కేంద్రంలో వేయించాలని కోరారు.డాక్టర్ లక్ష్మీసుధ మాట్లాడుతూ మండలంలో 2,832 మంది పిల్లలకు గానూ 2,747 మంది పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయటం జరిగిందన్నారు. 97శాతం వరకు చుక్కల మందు పంపిణీ పూర్తి చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి రాధిక, ఆయా గ్రామల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

95 శాతం చుక్కల మందు పంపిణీ పూర్తి

తెనాలిటౌన్: మండలంలోని కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిన్నారులకు ఆదివారం 95 శాతం మేర పోలియో చుక్కలు వేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు తెలిపారు. హాఫ్‌పేట, ఖాజీపేట, కొలకలూరు గ్రామాల్లోని పోలియో కేంద్రాలను డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ పరిశీలించినట్లు చెప్పారు. 21 కేంద్రాల్లో మొబైల్ టీమ్ ద్వారా పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. డాక్టర్ దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.



బస్టాండ్ ఆవరణలో పోలియో చుక్కలు వేస్తున్న వైద్యురాలు హెలెన్ నిర్మల



కొల్లిపరలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ పద్మావతి, ఎస్ఐ రవీంద్రరెడ్డి



కొలకలూరులో పోలియో చుక్కలు వేస్తున్న వైద్యుడు సుబ్బారావు



పాత ప్రభుత్వ వైద్యశాలలో చుక్కల మందు వేస్తున్న వైస్‌చైర్మన్ హరిప్రసాద్

ముగిసిన ఉపవాస కూడికలు

తెనాలిటౌన్: ఉపవాస ప్రార్థన క్రైస్తవ జీవితానికి చాలా అవసరమని, అలా చేయడం ద్వారా ఆధ్యాత్మిక అభివృద్ధి జరుగుతుందని బ్రదర్ ఆనందన్న తెలిపారు. ఇస్లాంపేటలోని యేసయ్య ప్రార్థనాకొండ చర్చిలో ఆదివారంతో ఉపవాస కూడికలు ముగిశాయి. దైవ జనులు బ్రదర్ ఆనందన్న వాక్య పరిచర్య చేశారు. సంఘస్తులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దైవ సేవకురాలు పి.రత్న కుమారి, చార్లెస్ వెస్లీ, ప్రశాంత్ బాబు, సీమోను, ఎలీషా, సంఘస్తులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



తెనాలి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రెయిన్‌బో ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి సంయుక్త నిర్వహణలో ఆదివారం మహిళా దినోత్సవ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్జీవో కల్యాణ మండపంలో సాయంత్రం నుంచి రుచికర, ఆరోగ్యకరమైన వంటల పోటీలు నిర్వహించారు. విజేతలను ప్రకటించి నగదు బహుమతులను ప్రదానం చేశారు. రాత్రి జరిగిన సభలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన పది మంది మహిళామణులను సత్కరించారు. సత్కారం అందుకున్నవారిలో ఉప్పాల రజనీదేవి (విద్య), డాక్టర్ డి.విజయమ్మ (వైద్యం), పెసర్లంక వసంతదుర్గ, షేక్ లలిత మనీషా(కళలు), నాగం జ్ఞానదివ్య (క్రీడలు), మాజేటి శారదాదేవి (ఆధ్యాత్మికం), తోటకూర గ్రేస్ విజయ(పోలీస్), కొండా ఉషారాణి (వ్యవసాయం), గండికోట పోలేరమ్మ (ఆర్టీసీ), నక్క నాగమణి (పారిశుద్ధ్యం) ఉన్నారు. రెయిన్‌బో ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.జీవనలత, సభ్యులు కల్యాణి, వరలక్ష్మి, గాయత్రి, జ్యోతి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు, అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ, జగదీశ్వరాంబ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సేవా కార్యక్రమాల్లో 'మానవత' ముందంజ



విద్యార్థిని చదువుకు రూ.50వేల చెక్కు అందజేస్తున్న హనుమంతరావు

తెనాలి: స్వచ్ఛంద సంస్థ మానవత ఆధ్వర్యంలో వివిధ రంగాల్లోని ప్రముఖులు సమాజసేవకు తమవంతు సహకారాన్ని అందించడానికి ముందుకు రావటం సంతోషకరమని సంస్థ రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం అన్నారు. సంస్థ సర్వసభ్య సమావేశం ఆదివారం ఇక్కడి ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలోని లైబ్రరీ హాలులో నిర్వహించారు. సంస్థ కార్యకలాపాలు ప్రోత్సాహకరంగా ఉన్నాయని, కమిటీ నిర్ణయాల ప్రకారం కొనసాగాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన పట్టణ చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ స్వచ్ఛంద సేవ పారదర్శకంగా ఉన్నపుడు దాతలకు కొదవ ఉండదని నిరూపణ అయిందన్నారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థుల చదువుకు సాయం, ఉపాధికి తోడ్పాటు, నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణతో ఉపాధిని సాధించుకునేలా చూడటం సంస్థ ద్వారా చేపట్టాలని కమిటీ సమావేశంలో నిర్ణయించినట్లు చెప్పారు. స్థానిక శాఖా గ్రంథాలయం నిర్వాహకులు కోరిన విధంగా రూ.55 వేల విలువైన ఫర్నిచర్, ఫ్యాన్లను సమకూర్చిన సంస్థ సభ్యులను అభినందించారు.హైదరాబాద్‌లో ఇంటర్ సెకెండ్ ఇయర్ చదువుతున్న పేద విద్యార్థిని విశ్వ నాగశ్రీకి మానవత తరపున విశ్రాంత ఉపాధ్యాయుడు మల్లే పెద్ది హనుమంతరావు రూ.50 వేల చెక్కును ఆమె తాతయ్యకు అందజేశారు. వివిధ రంగాల్లో ప్రముఖులైన మానవత సభ్యులు డాక్టర్ కేఎల్ఎస్ పద్మావతి, ఎం.అర్జునరావు, పరిమి శ్రీనివాస్, ఎస్.కృష్ణమూర్తి, నారాయణ, ఎస్.జయశేఖరరాజులు తమ పరిజ్ఞానంతో మానవత సభ్యులకు అందించగల సహకారాన్ని సభాముఖంగా వివరించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.కల్యాణి, కార్యదర్శి తస్నీరు శ్రీనివాసబాబు, ఉపాధ్యక్షుడు ఓంకార్ ప్రసాద్, సంయుక్త కార్యదర్శి ఎస్‌వీ శర్మ, కోశాధికారి పి.వెంకట్, వెంపటి సత్యనారాయణ మాట్లాడారు.

సీపీఎం సీనియర్ నేత మృతి

తెనాలి: సీపీఎం సీనియర్ నేత పాలడుగు నరసింహారావు (76) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. ఆయన స్వగ్రామం పెదకాకాని మండలం తంగెళ్లమూడి. ఆయనకు సీపీఎం పార్టీ తెనాలితో సుదీర్ఘమైన అనుబంధం ఉంది. 1974-85 మధ్య కాలంలో సీపీఎం కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నారు. పార్టీలో చేరింది మొదలు ఎన్ని ఆటు పోట్లు ఎదురైనా తుదిశ్వాస వరకు పార్టీ సిద్ధాంతాలను ఆచరించారు. తన మరణానంతరం సీపీఎంకు అందించాల్సిన సహకారంపై కుటుంబీకులకు నోట్ రాసినట్టు కుమారుడు తెలియజేశారు. సీపీఎం సీనియర్ నాయకులు ములకా శివసాంబిరెడ్డి, పట్టణ కార్యదర్శి కె.బాబూప్రసాద్, షేక్ హుస్సేన్‌వలి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు

చికిత్స పొందుతూ వ్యవసాయ కూలీ మృతి

తెనాలిరూరల్: ఆత్మహత్యాయత్నం చేసిన వ్యవసాయ కూలీ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నేలపాడుకు చెందిన కనపర్తి శోభన్‌బాబు(28) వ్యవసాయ పనులకు వెళుతుంటాడు. ఆరు నెలలుగా తీవ్ర కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో ఫిబ్రవరి 29న అధిక మొత్తంలో పెయిన్ కిల్లర్ టాబ్లెట్లు వేసుకున్నాడు. మాత్రల ప్రభావాన్ని భరించలేక గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు.

వరకట్నం వేధింపులపై కేసు

తెనాలిరూరల్: వరకట్నం వేధింపులపై కేసు నమోదైంది. పోలీసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొలకలూరు గ్రామానికి చెందిన స్వప్న తనను భర్త సుధీర్, అతని కుటుంబ సభ్యులు అధిక కట్నం కోసం మానసిక, శారీరక వేధింపులకు గురి చేస్తున్నారని పోలీసులను ఆశ్రయించింది. ఆదివారం కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

గుంటూరు ఈస్ట్: రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. శ్యామలానగర్‌లో ఓ వ్యక్తి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం దాడి చేశారు. పేరేచర్ల ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. 30క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులకు భవిత

హెల్త్, క్యాపిటల్ ఆసుపత్రుల చైర్మన్ డాక్టర్ నన్నపనేని



నమూనాలను పరిశీలిస్తున్న డాక్టర్ ప్రతాప్, సుధాకర్, తదితరులు



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో డాక్టర్ ప్రతాప్, సుబ్రమణ్యం, తదితరులు

తెనాలిఅర్బన్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని హెల్త్, క్యాపిటల్ ఆసుపత్రుల చైర్మన్ డాక్టర్ నన్నపనేని ప్రతాప్, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రమణ్యం పేర్కొన్నారు. ఎన్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల, యంగ్ ఇండియన్స్ అమరావతి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కళాశాల ఆవరణలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. దీనిని డాక్టర్ ప్రతాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తాము విద్య నేర్చుకున్న పాఠశాలను నమూనా రూపంలో తయారు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని అభిలాషించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన 150 నమూనాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉత్తమ ప్రాజెక్టులు తయారుచేసిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో కేఎల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ జయరామకృష్ణ, యంగ్ ఇండియన్ సంస్థ నిర్వాహకులు డాక్టర్ భవన్ చంద్, హరికృష్ణ, సూర్య, ఫణీ రామ్, చైతన్య కళాశాల ప్రిన్సిపల్ సునీల్‌కుమార్, కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని ప్రతాప్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపల్ వీబీఎస్ అజయ్, పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు



పెదపలకలూరులో కవాతు నిర్వహిస్తున్న డీఎస్పీ మహబూబ్‌బాషా, సిబ్బంది



తక్కెళ్లపాడులో సీఐ వీరాస్వామి ఆధ్వర్యంలో కవాతు చేస్తున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు

గుంటూరు రూరల్: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజా రక్షణ, శాంతి భద్రతల్ని కాపాడేందుకు ఆదివారం పలు గ్రామాల్లో పోలీస్ కవాతు నిర్వహించినట్లు సౌత్ జోన్ డీఎస్పీ మహబూబ్‌బాషా తెలిపారు. గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు నల్లపాడు సీఐ సీహెచ్. రాంబాబు నేతృత్వంలో స్టేషన్ సిబ్బందితో పాటు కేంద్ర బలగాలు సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది 100 మంది కలసి మండలంలోని పెదపలకలూరు, చిన్న పలకలూరు, మల్లవరం, దాసుపాలెం, తోకవారిపాలెం గ్రామాల ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కవాతు నిర్వహించామని చెప్పారు.

పెదకాకానిలో..

గ్రామాల్లో శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పెదకాకాని సీఐ కొమ్మనబోయిన నాగేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలో మండలంలోని తక్కెళ్లపాడులో సిబ్బంది అడ్డ రోడ్డు నుంచి ఎస్టీ కాలనీ వరక ప్రధాన రోడ్డులో కవాతు నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల వద్ద వివాదాలకు పాల్పడినా, నిబంధలకు విరుద్ధంగా వ్యవహరించినా, పోలింగ్‌కు ఆటంకం కలిగించినా, నకిలీ ఓటు వేసేందుకు ప్రయత్నిస్తూ పట్టుబడినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసి పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు.

క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోండి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. తెలుగు కబడ్డీ లీగ్ సంస్థ ఆధ్వర్యంలో ఐతానగర్‌లోని ఎస్ఎస్ఎస్ఎం స్కూల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో యువత క్రీడలకు తగినంత ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శారీరక వ్యాయామం లేకపోవడం వలన అనారోగ్యాలు వచ్చే అవకాశాలు ఉందన్నారు. కార్యక్రమంలో తెలుగు కబడ్డీ లీగ్ సీఈవో అనిల్, వంశీ, యాంకర్ నరేష్‌రాయ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొమ్ము ఖిజ్బాల్ రాయల్, జాడ్జి, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు విలువలతో కూడిన విద్యను నేర్వాలి

కుమార్‌పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న వ్యాపారవేత్త సుబ్రహ్మణ్యం

తెనాలిఅర్బన్: విలువలతో కూడిన విద్యను విద్యార్థులు నేర్వాలని ప్రముఖ వ్యాపారవేత్త, కుమార్‌పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.సుల్తానాబాద్ కుమార్ కాలనీలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ 12వ వార్షికోత్సవ వేడుకలను శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ మారుతున్న సమాజానికి అనుగుణంగా విద్యా వ్యవస్థలో అనేక మార్పులు వస్తున్నాయని చెప్పారు. వాటిని విద్యార్థులంతా అందిపుచ్చుకోవాలని సూచించారు. మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో అనేక సంస్కరణలు తీసుకు వచ్చిందని చెప్పారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. సమావేశంలో డాక్టర్ తూనుగుంట్ల రాధాభాయ్, డాక్టర్ సాములు లక్ష్మణబాబు, యర్రంశెట్టి హనుమంతరావు, కోడూరు రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

నందివెలుగులో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ కోటేశ్వరరావు

తెనాలిటౌన్: రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో ప్రధాన మెయిన్ రోడ్డు సెంటర్‌లో 'మేము సైతం' యువజన సేవా సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని ఆదివారం రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు, నందివెలుగు సర్పంచ్ దూళిపాళ్ల పవన్‌కుమార్‌లు ప్రారంభించారు. గత ఆరు సంవత్సరాల నుంచి సెంటర్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. మేము సైతం సభ్యులు గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని సర్పంచ్ పవన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కల్యాణం సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి షేక్ షుకూర్‌బాషా, ఉపాధ్యక్షుడు యర్రమోతు జగన్‌మోహనరావు, సభ్యులు పాల్గొన్నారు.

నీటిని వృథా చేయొద్దు



నగరంపాలెం: ప్రతి ఒక్కరూ నీటి ఆవశ్యకతను తెలుసుకోవాలని జేకేసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.నాగేశ్వరరావు సూచించారు. కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్- 2 ఆధ్వర్యంలో ఆదివారం అడవితక్కెళ్లపాడు గ్రామ పరిధిలో నీటి ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వృథా చేయవద్దని గ్రామస్తులకు తెలిపారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రతి ఇంటికెళ్లి నీటి సంరక్షణ మార్గాలు, ఆవశ్యకత, భూగర్భ జలాలను అభివృద్ధి చేసే మార్గాల్ని వివరించారు. కార్యక్రమంలో ఉప ప్రిన్సిపాల్ పి.గోపీచంద్, పీజీ కోర్స్ డైరెక్టర్ ఎస్ఆర్కే ప్రసాద్, కార్యక్రమ నిర్వహణ అధికారి డి.రాహుల్ పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి స్పందన



గుంటూరు రూరల్: ఆయుర్వేద వైద్యం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు త్వరితగతిన నయం అవుతాయని శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం నగర శివారుల్లోని ఇన్నర్ రింగ్ రోడ్డు సమీపంలోగల శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పురాతన వైద్యాల్లో ఆయుర్వేదం ప్రఖ్యాతిగాంచినట్లు తెలిపారు. సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా రోగులకు వైద్యం అందజేస్తున్నామని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 100 పడకలతో సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం 250 మందికి పరీక్షలు నిర్వహించి, పలువురికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెనుమూడి కరుణాకర్, ఈదా సాంబిరెడ్డి, వైద్యులు డాక్టర్ ధనలక్ష్మి, డాక్టర్ సాయిగౌతమి, డాక్టర్ భానుకశ్యప్, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ శ్రావణ్, డాక్టర్ చరిష్మా, మేనేజర్ మల్లేశ్వరి పాల్గొన్నారు.